క్లుప్తంగా

నూతన ఓటర్ల వివరాలు సరిచూసుకోవాలి

తహసీల్దార్ వెంకటేశ్ ప్రసాద్



బీఎల్ఓలకు ఓటరు లిస్టులు అందజేస్తున్న తహసీల్దార్ వెంకటేశ్ ప్రసాద్

దుద్యాల్: నూతన ఓటర్లతో కూడిన లిస్టును సోమవారం తహసీల్దార్ వెంకటేశ్ ప్రసాద్ బీఎల్ఓలకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొత్త లిస్టును ఆయా పంచాయతీ కార్యాలయంలో ప్రదర్శిస్తారని.. కొత్తగా నమోదు చేసుకున్న ఓటర్లు లిస్టులో తమ పేరు ఉందో లేదో చూసుకోవాలన్నారు. తప్పులుంటే బీఎల్ఓలకు చెప్పాలన్నారు. బీఎల్ఓలను సంప్రదించినా వివరాలు వెల్లడిస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో బీఎల్ఓలు యాదమ్మ, రాజేశ్వరి, రత్నబాయి తదితరులు పాల్గొన్నారు.

సహోద్యోగికి ఆర్థికసాయం



విద్యాసాగర్‌కు నగదు అందజేస్తున్న ఎంఈఓ

పరిగి: రోడ్డు ప్రమాదంలో గాయపడిన సహోద్యోగి చికిత్స నిమిత్తం ఆర్థికసాయం అందజేయడం అభినందనీయమని మండల విద్యాధికారి గోపాల్ అన్నారు. మండల విద్యా వనరుల కేంద్రంలో సీఆర్‌పీగా విధులు నిర్వహిస్తున్న విద్యాసాగర్ రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. దీంతో ఉపాధ్యాయులు, సీఆర్‌పీలు కలిసి రూ.45వేలు పోగు చేసి ఎంఈఓ చేతుల మీదుగా విద్యాసాగర్‌కు అందజేశారు.

ఎస్ఎస్‌కే సమాజ్ రాష్ట్ర అధ్యక్షుడికి సన్మానం



డాక్టర్ విశ్వనాథ్‌ను సన్మానిస్తున్న కొడంగల్ సమాజం సభ్యులు

కొడంగల్ రూరల్: సోమవంశ సహస్రార్జున క్షత్రియ పట్కర్(ఖత్రి) కమిటీ(ఎస్ఎస్‌కే) తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన డాక్టర్ విశ్వనాథ్ విశ్రాంత ఐపీఎస్‌ను కొడంగల్ ఎస్ఎస్‌కే సమాజం సభ్యులు ఘనంగా సన్మానించారు. సోమవారం హైదరాబాద్‌లో నిర్వహించిన ఎస్ఎస్‌కే సమాజం సమావేశంలో కొడంగల్ సమాజం అధ్యక్షుడు డాక్టర్ హీరాలాల్, సభ్యులు ఓంప్రకాష్, మల్లికార్జున రావు, తుకారం, డాక్టర్ గోపి కిషన్, టి.శ్రీకాంత్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ విశ్వనాథ్‌ను శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. సంఘం అభివృద్ధికి కృషిచేయాలని కోరారు.

సీఎంఆర్ఎఫ్.. పేదలకు వరం

కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సలీం



చెక్కును అందిస్తున్న నాయకులు

కుల్కచర్ల: సీఎంఆర్ఎఫ్ పేదలకు వరంలాంటిదని కాంగ్రెస్ చౌడాపూర్ మండల అధ్యక్షుడు సలీం, యువజన విభాగం మండల అధ్యక్షుడు రాము అన్నారు. చౌడాపూర్‌కు చెందిన ఎరుకలి వెంకటేశ్ అనారోగ్యంతో ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స చేయించుకున్నాడు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే సీఎంఆర్ఎఫ్‌కు సిఫారసు చేశారు. ఆయనకు మంజూరైన రూ.15వేల విలువైన చెక్కును సోమవారం బాధితుడికి అందజేశారు. ఈ కార్యక్రమంలో కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు మాసయ్య, గ్రామ కమిటీ అధ్యక్షుడు యాదయ్య, నాయకులు యాదయ్య, హన్మంతు, గోపాల్, మణికంఠ, శరత్ కుమార్, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

హైమాస్ట్ లైట్ల ఏర్పాటు

దోమ: గ్రామాల్లో హైమాస్ట్ లైట్ల ఏర్పాటుకు ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారని కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు అన్నారు. సోమవారం మండల పరిధిలోని బొంపల్లి, శివారెడ్డిపల్లి గ్రామా లలో హైమాస్టట్ లైట్లను ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా ఎమ్మెల్యే నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ యువజన విభాగం మండల అధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డి, నరసింహారెడ్డి, చంద్రశేఖర్, రాములు, బషీర్, సుధాకర్, మహేశ్, యాదయ్య, నర్సింలు, సత్తయ్య, అనంతయ్య, తాహెర్, నరసింహులు పాల్గొన్నారు.

దూది రైతుకు దుఃఖం

పత్తి ఏరేందుకు కూలీలు దొరక్క రైతులు ఇబ్బంది పడుతున్నారు. ఆరుగాలం శ్రమించి పండించిన పంటకు మార్కెట్‌లో ధర అనుకూలించినా కూలీల సమస్య తలనొప్పిగా మారింది. దీంతో దూది చేలల్లోనే రాలిపోతోందని కర్షకులు ఆందోళన చెందుతున్నారు.

తెల్ల బంగారం ఏరేందుకు కూలీల కొరత

- కిలో పంట తీసేందుకు రూ.12 డిమాండ్
- యంత్రాల సరఫరాలో అధికారుల మీనమేషాలు
- రైతుల ఆందోళన



కూలీలు దొరకక చేనులోనే వదిలిన పత్తి

దౌల్తాబాద్: పంట కోతకొచ్చిన సమయంలో పత్తి రైతులు కూలీల కొరతతో సతమతమవుతున్నారు. పంట వేసింది మొదలు ఇప్పటి వరకు పెట్టిన పెట్టుబడులు ఒక ఎత్తుకాగా కేవలం చేలో నుంచి పత్తి తీయడం మరో ఎత్తయింది. మొక్కజొన్న, పత్తి ఒకేసారి చేతికి రావడంతో వాటిని పొలాల నుంచి వేరుచేసి ఇంటికి తీసుకురావడం రైతుకు ఇబ్బందిగా మారింది. పత్తి పంట ఎక్కువగా సాగుచేసే ప్రాంతాల్లో పత్తి తీసేందుకు కూలీలు దొరక్క ఇతర ప్రాంతాల నుంచి తీసుకురావాల్సి వస్తోంది. దీంతో పెద్ద రైతులు కూలీలకు కూలీ డబ్బులు చెల్లించేందుకు పోటీ పడుతుండగా చిన్న సన్నకారు రైతులు అంత సొమ్ము చెల్లించలేక ఆందోళనకు గురవుతున్నారు. ఇటీవల కురిసిన వర్షానికి పత్తి నల్లబారింది.

పెరుగుతున్న ఖర్చు.. తగ్గుతున్న ఆదాయం

గతేడాది వరకు కిలో రూ.8 చొప్పున పత్తి తీసిన కూలీలు ఈ సంవత్సరం ఒక్కసారిగా కూలి రేటు పెంచేశారు. కిలో పత్తి తీయాలంటే రూ.12 ఖర్చు చేయాల్సి వస్తోంది. ఈ లెక్కన ఒక క్వింటాళ్ పత్తి తీయించేందుకు రైతు రూ.1,200 వరకు ఖర్చు చేయాలి. ఆ తర్వాత పత్తిని ఆటోల్లో ఇంటికి తరలించడానికి వేరే ప్రాంతాల నుంచి ఆటోల్లో కూలీలను పంట పొలాలకు తీసుకురావడానికి అదనంగా ఖర్చు చేయాల్సి వస్తోంది. ఈ లెక్కన ఎకరంలో ఎనిమిది నుంచి 10 క్వింటాళ్ల పత్తి పండితే దానికి రూ.12వేలు ఖర్చు చేయాల్సి వస్తోంది. దీంతో ఎరువులు, పురుగు మందుకు అయ్యే ఖర్చులతో పాటు పత్తి తీసేందుకు అయ్యే ఖర్చులు పోటీ పడుతుండడంతో రైతులకు రావాల్సిన ఆదాయం గణనీయంగా తగ్గిపోతుంది.

యంత్రాలు ఎప్పుడిస్తారో?

వ్యవసాయంలో యాంత్రీకరణ పెరిగిపోతున్న దశలో ఇప్పటికీ పత్తిని ఏరేందుకు ఎటువంటి యంత్రం అందుబాటులోకి రావడంలేదు. కొంత కాలంగా వ్యవసాయధికారులు పత్తిని తీసే యంత్రం వచ్చింది రైతులు ముందు డెమో చేసి చూపిస్తామని చెబుతన్నారే తప్పా అందుకు పూనుకోవడంలేదు. అయితే ఆ యంత్రాన్ని వినియోగించడంలోనూ సమస్యలు ఉన్నాయని మరోవైపు వారే చెబుతున్నారు. గత సంవత్సరంలో పోలిస్తే ఈ ఏడాది పత్తి సాగు గణనీయంగా పెరిగింది. దీంతో కూలీలు దొరక్క పొలాల్లో పత్తి నేలమీద పడి పాడవ్వడంతో ఏంచేయాలో పాలుపోక రైతులు ఆందోళన చెందుతున్నారు.

'మాది ధర్మ పోరాటం'



బషీరాబాద్: తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న తపస్ ఉపాధ్యాయ సంఘం నాయకులు

బషీరాబాద్: డీఏ, పీఆర్సీతో పాటు పెండింగ్ బిల్లుల సాధనకు తాము ధర్మపోరాటం చేస్తున్నామని తెలంగాణ ప్రాంతీయ ఉపాధ్యాయ సంఘం(తపస్) నాయకులు అన్నారు. సోమవారం మండలంలోని వివిధ పాఠశాలల నుంచి తరలి వచ్చిన ఉపాధ్యాయులు తహసీల్దార్ వెంకటేష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర నాయకులు దూస రాములు మాట్లాడుతూ.. ఉద్యోగ, ఉపాధ్యాయులకు పెండింగ్‌లో ఉన్న బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు. దీపావళి పండుగ లోపు ఇచ్చిన హామీలన్నీ అమలు చేయాలని అన్నారు. లేదంటే వచ్చే నెలల నుంచి ఉద్యోగ, ఉపాధ్యాయులమంతా ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తపస్ నాయకులు గాజుల వీరేశం, రవీందర్, నర్సింలు, అనిల్, శ్రీనివాస్, సునీత, లక్ష్మి, హరీశ్, సేవ్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న తపస్ నాయకులు

దుద్యాల్: ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం మండల శాఖ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు సోమవారం తహసీల్దార్ వెంకటేశ్ ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు బకాయిపడిన నాలుగు డీఏలను, ఈ-కుబేర్ పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని.. పీఆర్సీ అమలు చేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో తపస్ మండల అధ్యక్షుడు శంకరప్ప, ప్రధాన కార్యదర్శి తేజస్విని, ఉపాధ్యాక్షుడు అశోక్, కోశాధికారి దిలాప్, కార్యదర్శి అంజిలయ్య, రమా తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ధార్మిక సెల్ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ



బైక్ ర్యాలీలో పాల్గొన్న పార్టీ శ్రేణులు

అనంతగిరి: బీజేపీ ధార్మిక సెల్ ఆధ్వర్యంలో సోమవారం వికారాబాద్ పట్టణంలో బైక్ ర్యాలీ చేపట్టారు. ఎన్నెపల్లి చౌరస్తా నుంచి పట్టణంలోని ప్రధాన చౌరస్తాల మీదుగా ఈ ర్యాలీ కొనసాగింది. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు మాధవ రెడ్డి, ధార్మిక సెల్ రాష్ట్ర కన్వీనర్ సూర్యప్రకాష్, సహ కన్వీనర్ నిరంజన్ దేశాయ్, జిల్లా ఇన్‌చార్జి డాక్టర్ రాజశేఖర్, జాయింట్ కన్వీనర్ మోహన్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు నరోత్తంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నామినేటెడ్ పదవుల్లో అవకాశం ఇవ్వండి



ఎమ్మెల్యే టీఆర్ఆర్‌తో ఎస్టీ సెల్ నాయకులు

కుల్కచర్ల: నామినేటెడ్ పదవుల్లో గిరిజన నాయకులకు అవకాశం కల్పించాలని ఎస్టీ సెల్ మండల నాయకులు శివరాములు, విఠల్ నాయక్ అన్నారు. సోమవారం నగరంలోని ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి నివాసంలో ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. కాంగ్రెస్ అభ్యున్నతికి గిరిజన నాయకుల కృషి ఎంతో ఉందని.. వారి కష్టాన్ని గుర్తించాల్సిన అవసరం ఉందన్నారు. కేవలం రిజర్వేషన్లు ఉన్న సందర్భంలోనే కాకుండా జనరల్ స్థానాల్లోనూ అవకాశం కల్పించాలని కోరారు. వినతిపత్రం ఇచ్చినవారిలో రవి, నీల్యానాయక్ తదితరులు ఉన్నారు.

అభ్యసన ప్రక్రియలపై దృష్టి సారించాలి



కుదురుమల్ల పాఠశాలలో విద్యార్థుల గణిత సామర్థ్యాలను పరిశీలిస్తున్న ఎంఈఓ

దుద్యాల్: మండల పరిధిలోని ఆలేడ్, కుదురుమల్ల పాఠశాలలను మండల విద్యాధికారి విజయరామారావు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు పాఠ్యాంశం బోధించిన తర్వాత విషయ అవగాహన ఎంత వరకు జరిగింది. పూర్తి స్థాయిలో బోధనను అర్థం చేసుకున్నారా లేనిది నిర్ధారణకు విద్యార్థులను ప్రశ్నించాలి. గణితంపై ప్రత్యేక శ్రద్ధ వహించి అర్థవంతంగా, సూక్ష్మ పద్ధతిలో బోధించాలని సూచించారు. ఆలేడ్ పాఠశాల సమస్యలను హెచ్ఎం గౌతమి ఎంఈఓకు వివరించారు.

ముగిసిన ఎస్ఏ-1 పరీక్షలు

వారం రోజులుగా కొనసాగుతున్న ఎస్ఏ-1 పరీక్షలు సోమవారంతో ముగిసాయి. మండలంలోని 30 పాఠశాలల్లో ఈ పరీక్షలు నిర్వహించగా దాదాపు 2,300 మంది విద్యార్థులు పరీక్షలు వ్రాశారని మండల విద్యాధికారి విజయరామారావు తెలిపారు.

సబ్సిడీపై తుంపర సేద్యం పరికరాలు

కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి



బొంరాస్‌పేట: భూమిపూజ చేస్తున్న తిరుపతిరెడ్డి

బొంరాస్‌పేట: సాగునీటి పొదుపును పాటించేందుకు, అధిక దిగుబడి సాధించేందుకు కొడంగల్, బొంరాస్‌పేట మండలాల రైతులకు తుంపర సేద్యం పరికరాలను పంపిణీ చేశారు. సోమవారం ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి హాజరైన కాంగ్రెస్ నియోజకవర్గ తిరుపతిరెడ్డి నియోజకవర్గ పరిధిలోని 165 మంది రైతులకు తుంపర సేద్యం పరికరాలు అందించారు. యూనిట్ విలువ రూ.23,385 ఉండగా రైతు రూ.7,483 చెల్లించగా మిగితా ప్రభుత్వ రాయితీ కల్పిస్తోందని అధికారులు వివరించారు. అనంతరం బాధితులకు మంజూరైన రూ.20లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నర్సింలు గౌడ్, వెంకట్రాములుగౌడ్, రాంచంద్రారెడ్డి, నర్సింలునాయుడు, కిష్టప్ప అధికారులు ఉన్నారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ

బొంరాస్‌పేట: మండల కేంద్రంలో భవన నిర్మాణ పనులకు కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి శంకుస్థాపన చేశారు. మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల మైదానం ఆవరణంలో రూ.50లక్షలతో గ్రంథాల భవన నిర్మాణం, రూ.20లక్షలతో అదనపు తరగతి గదులకు ఆయన భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ రాజేశ్‌రెడ్డి, గ్రంథాలయ కార్యదర్శి సురేశ్‌బాబు, కడా అధికారి వెంకటరెడ్డి, ఎంఈఓ హరిలాల్, నాయకులు నర్సింలుగౌడ్, వెంకట్రాములుగౌడ్, రాంచంద్రారెడ్డి, నర్సింలునాయుడు, కిష్టప్ప తదితరులున్నారు.

ఎత్తుకు తగిన బరువు ఉండాలి

పెద్దేముల్: చిన్నారులు వయస్సు, ఎత్తుకు తగిన బరువు ఉండాలని పెద్దేముల్ సూపర్‌వైజర్ సునీత అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో 29 గ్రామాల అంగన్‌వాడీ టీచర్లతో సెక్టార్ మీటింగ్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సునీత మాట్లాడుతూ.. చిన్నారులకు క్రమం తప్పకుండా బాలమృతం ఇవ్వాలన్నారు. పిల్లల బరువుకు శ్యామ్, మ్యామ్ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. తక్కువ బరువున్న పిల్లలకు ఎన్ఆర్‌సీయూ సెంటర్‌కు తరలించి చెకప్ చేయించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు సమయపాలన తప్పనిసరి అని లేదంటే చర్యలు తప్పవని హెచ్చరించారు.

మొదటి దశ డిజిటల్ సర్వే పూర్తి

అనంతగిరి: సర్వే ఆఫ్ ఇండియా టీం ఆధ్వర్యంలో అమృత్ 2.0 కార్యక్రమంలో భాగంగా పది రోజులుగా డ్రోన్ కెమెరాలతో చేపట్టిన వికారాబాద్ మున్సిపల్ మాస్టర్ ప్లాన్ డిజిటల్ సర్వే మొదటి దశ సోమవారంతో పూర్తయిందని వికారాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ మంజుల అన్నారు. ఈ సందర్భంగా ఆమె సర్వే ఆఫ్ ఇండియా టీం, డీటీసీపీ టీం, మున్సిపల్ సిబ్బందిని అభినందించారు. కార్యక్రమంలో డీఈ రాకేష్ రెడ్డి, టీపీఓ వేణుగోపాల్ పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

యాలాల ఎస్ఐ శంకర్



బొంరాస్‌పేట: విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ ఎండీ అబ్దుల్ రవూఫ్

యాలాల: విద్యార్థులు న్యాయ చట్టాలు, సెక్షన్లపై అవగాహన పెంచుకోవాలని యాలాల ఎస్ఐ శంకర్ సూచించారు. సోమవారం పోలీస్ స్టేషన్ ఓపెన్ హౌస్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా కేజీబీవీ విద్యార్థులకు చట్టాలు, ఆయుధాలు, కోర్టులు, డయల్ 100 లాంటి వాటిపై అవగాహన కల్పించారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు ఎంచుకుని చదువు సాగించాలన్నారు. పీఎస్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో సిబ్బంది ఏ విధంగా మాట్లాడుతారు? ఫిర్యాదు తీసుకునే విధానం, ఎఫ్ఐఆర్, సివిల్, క్రిమినల్ కేసుల వివరాలను వెల్లడించారు. అనంతరం పోలీస్ సిబ్బంది వాడే ఆయుధాల గురించి వివరించారు. చట్టం అందరికి ఒకే రకంగా ఉంటుందన్నారు. చట్టం దృష్టిలో అందరూ సమానులేనన్నారు. అత్యవసర సమయాల్లో డయల్ 100, చైల్డ్‌లైన్ ఫిర్యాదు కోసం 1098 లాంటి వాటిపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పీఎస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

పోలీసు వ్యవస్థపై అవగాహన అవసరం



యాలాల: విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ శంకర్



కుల్కచర్ల: విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ అన్వేశ్‌రెడ్డి

కుల్కచర్ల: పోలీసు వ్యవస్థ చట్టాలు, కేసులు తదితర విషయాలపై విద్యార్థులు అవగాహన పెంపొందించుకోవాలని కుల్కచర్ల ఎస్ఐ అన్వేశ్‌రెడ్డి అన్నారు. పోలీసు అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా సోమవారం కుల్కచర్ల ఠాణాలో ఓపెన్‌హౌస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసుల పాత్ర, బాధ్యతలను ప్రతీ ఒక్కరు తెలుసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఆంజనేయులు, ఉపాధ్యక్షుడు కృష్ణయ్య, కుల్కచర్ల జెడ్పీహెచ్ఎస్(బాలుర) విద్యార్థులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీలు

బొంరాస్‌పేట: పోలీసు అమరవీరుల వారోత్సవాల సందర్భంగా సోమవారం బొంరాస్‌పేట పీఎస్‌లో ఓపెన్‌హౌస్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అనంతరం స్థానిక జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. పోలీస్ స్టేషన్ నిర్వహణ, రికార్డులు, విచారణ, ఆయుధాలు పనితీరు తదితర అంశాలపై వివరించారు.

డీటీ సందీప్ బాధ్యతల స్వీకరణ

తాండూరు రూరల్: తాండూరు తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్‌గా సందీప్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన విజయేందర్ ధారూర్ మండలానికి బదిలీపై వెళ్లారు. దీంతో హైదరాబాద్‌లోని షేక్‌పేట్ తహసీల్దార్ కార్యాలయంలో పని చేస్తున్న డిప్యూటీ తహసీల్దార్ సందీప్‌ను తాండూరుకు బదిలీ చేశారు. సెలవులో ఉన్న ఆయన సోమవారం బాధ్యతలు స్వీకరించారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం

మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి

కుల్కచర్ల: నిరుపేద ప్రజలకు, బీఆర్ఎస్ కార్యకర్తల కుటుంబాలకు తాము అండగా ఉంటామని పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని గోరిగడ్డ తండాకు చెందిన బీఆర్ఎస్ కార్యకర్త బుగ్యానాయక్ వారం క్రితం మృతి చెందాడు. కాగా సోమవారం మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి బాధిత కుటుంబీకుల ఇంటికి వెళ్లి వారిని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు రాజప్ప, రాజు, అంగూర్ తదితరులు పాల్గొన్నారు.

కమీషన్లలో కోత సరికాదు

లియాఫీ జాతీయ నాయకుడు బీఎస్ చారి

అనంతగిరి: ఎల్ఐసీ ఏజెంట్ల కమీషన్లలో కోత విధించడం సరికాదని లైఫ్ ఇన్సూరెన్స్ ఏజెంట్ల ఫెడరేష్ (లియాఫీ) జాతీయ నాయకులు బీఎస్ చారి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం వికారాబాద్ ఎల్ఐసీ కార్యాలయం ఎదుట ఎల్ఐసీ ఏజెంట్లు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా బీఎస్ చారి మాట్లాడుతూ.. అనాలోచిత నిర్ణయాలతో ఏజెంట్ల ఆత్మస్థైర్యం దెబ్బతింటుందన్నారు. కమీషన్ల కోత నిర్ణయాన్ని సంస్థ ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వికారాబాద్ బ్రాంచ్ అధ్యక్షుడు శ్రీనివాస్, కార్యదర్శి మాణిక్‌రెడ్డి, సుదర్శనం, శేఖర్‌స్వామి, మనోహర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, నర్సింహారెడ్డి, రవిచంద్ర తదితరులు పాల్గొన్నారు.

క్లోరినేషన్ తప్పనిసరి

ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సాయి ప్రణీత్



అనంతగిరి: మాట్లాడుతున్న ఎంపీడీఓ వినయ్‌కుమార్

తాండూరు రూరల్: గ్రామాల్లోని తాగునీటి ట్యాంకుల్లో క్రమం తప్పకుండా క్లోరినేషన్ చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ మండల ఏఈ సాయి ప్రణీత్ అన్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో వాటర్‌మెన్‌లకు ఇస్తున్న శిక్షణ సోమవారంతో మూడవ రోజుకు చేరింది. ఈ సందర్భంగా ఏఈ మాట్లాడుతూ.. పదివేల లీటర్ల నీటిలో 40 గ్రాముల బ్లీచింగ్ పౌడర్‌ను కలిపి క్లోరినేషన్ చేయాలన్నారు. ఆర్వో, బోరు నీరు, మిషన్ భగీరథ నీటి మధ్య తేడాలపై అవగాహన కల్పించారు. క్లోరినేషన్ చేసిన తర్వాత నీరు పసుపు రంగు రవాలని చెప్పారు. బ్లీచింగ్ పౌడర్ కలిపిన అరగంట అనంతరం నీటి సరఫరా చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో మిషన్ భగీరథ గ్రిడ్ ఏఈ ప్రతిభ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛమైన తాగునీరు అందించాలి

అనంతగిరి: నీటి సరఫరాలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని వికారాబాద్ ఎంపీడీఓ వినయ్‌కుమార్ అన్నారు. వికారాబాద్ ఎంపీడీఓ కార్యాలయంలో వాటర్‌మెన్‌లకు శిక్షణ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మట్లాడుతూ.. ప్రతీ ఇంటికి మిషన్ భగీరథ నీరు అందేలా వాటర్‌మెన్ చూడాలన్నారు. తాగునీరు కలుషితం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పైప్‌లైన్ మరమ్మతులకు గురైతే వెంటనే పంచాయతీ కార్యదర్శికి సమాచారం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ దయానంద్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రవి, కార్యాలయం సూపరింటెండెంట్ చెన్నారెడ్డి, ఉపాధి హామీ ఏపీఓ శీను, ఐకేపీ ఏపీఎం లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

యోగా థెరపీలో భీమయ్య సత్తా



సర్టిఫికెట్ అందుకుంటున్న భీమయ్య

కుల్కచర్ల: ప్రపంచ యోగా థెరపీ దినోత్సవం సందర్భంగా ఆదియోగి పరమేశ్వర ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నగరంలోని రామంతాపూర్‌లో రాష్ట్రస్థాయి యోగా చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో మండల పరిధిలోని ఇప్పాయిపల్లి గ్రామానికి చెందిన తుప్పుడు భీమయ్య ప్రతిభ చాటి మొదటి స్థానంలో నిలిచాడు. ఈ సందర్భంగా ఆయనకు బహుమతి అందించి సత్కరించారు.

సమస్య పరిష్కారానికి ఇంటర్‌లింకింగ్ పనులు

ధారూరు: ఎట్టికేలకు నాగసమందర్ విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచి ధారూరు వరకు 11 కేవీ విద్యుత్ లైన్ పనులు సోమవారం ప్రారంభమయ్యాయి. మండల కేంద్రంలో విద్యుత్ సబ్‌స్టేషన్ ఉన్నప్పటికీ చిన్న సమస్యలకే విద్యుత్ సరఫరా నిలిచిపోతోంది. దీంతో వినియోగదారులు తరుచూ ఫిర్యాదు చేయడంతో వికారాబాద్ ట్రాన్స్‌కో ఏడీ సత్యనారాయణ రెడ్డి సరఫరాలో అంతరాయం ఉండకుండా చర్యలు తీసుకుంటున్నారు. నాగసమందర్-ధారూరు మధ్య 11 కేవీ విద్యుత్ లైన్ ఏర్పాటు పనులను చేపట్టారు. కాంగ్రెస్ నాయకుడు మహ్మద్ బాబాఖాన్ పలుమార్లు ట్రాన్స్‌కో ఏడీని కలిసి సమస్యను వివరించారు. దీంతో ఆయన సమస్య పరిష్కారానికి ఇంటర్‌లింకింగ్ పనులు చేయిస్తున్నారు.